సాక్షి
నిజామాబాద్

సోమవారం । 23 । సెప్టెంబర్ । 2024

న్యూస్‌రీల్

నకిలీ నియామకాలపై విచారణ

నిజామాబాద్ అర్బన్: జిల్లాలోని పాఠశాలల్లో నకిలీ నియామకాల వ్యవహారంపై విద్యాశాఖ విచారణ చేపట్టింది. గ్లోబల్ ఫౌండేషన్ పేరిట రాజు అనే వ్యక్తి నకిలీ నియామక పత్రాలు సృష్టించాడు. నిందితుడిపై సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేస్తామని డీఈవో తెలిపారు. విద్యాశాఖ అధికారులు కూడా ఈ వ్యవహారంపై విచారణ చేపడుతున్నట్లు ప్రకటనలో తెలిపారు.

ప్రభుత్వ సలహాదారును కలిసిన నిఖత్ జరీన్



నిజామాబాద్ నాగారం: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీని అంతర్జాతీయ స్థాయి బాక్సర్, డీఎస్పీ నిఖత్ జరీన్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (స్పెషల్ పోలీస్)గా తన నియామకానికి కృషి చేసినందుకు ఆమె షబ్బీర్ అలీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడల కోసం సీఎం రేవంత్ రెడ్డి విజన్‌ను వివరించారు. ఒలింపిక్ స్థాయి అథ్లెట్లను తయారు చేయడానికి క్రీడా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తామన్నారు.

హరిహర ఆలయానికి చేరుకున్న బాలాజీ జెండా



నిజామాబాద్ రూరల్: డిచ్‌పల్లి మండలం బర్దిపూర్‌లోని హరిహర ఆలయానికి ఆదివారం సాయంత్రం బాలాజీ జెండా చేరుకుంది. గ్రామస్తులు జెండాకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు పోల చిన్న రాములు, సిరికొండ సుభాష్ పాల్గొన్నారు.

రేపు ఉమ్మడి జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

కామారెడ్డి టౌన్: జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కామారెడ్డిలో ఉమ్మడి జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని భవానీరోడ్‌లో గల బ్యాడ్మింటన్ అకాడమీలో ఈ పోటీలు జరుగుతాయని ఎస్‌జీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి హీరాలాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-17లో బాలబాలికలు పాల్గొనాలని కోరారు. ఈ పోటీలలో ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 94900 15388, 94409 26006 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ధరణి టౌన్ షిప్‌లో వసతులు కల్పించాలి



కామారెడ్డి రూరల్: జిల్లా కేంద్రం శివారులోని ధరణి టౌన్ షిప్‌లో 2022 మార్చిలో ప్రభుత్వం వేలంపాట నిర్వహించి ఇళ్లు, ప్లాట్లను విక్రయించి మౌలిక వసతులు కల్పించలేదని ఆరోపిస్తూ కొనుగోలుదారులు ఆదివారం టౌన్ షిప్ ఎదుట నిరసన తెలిపారు. వెంటనే ధరణి టౌన్ షిప్‌లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2022 మార్చిలో ప్రభుత్వం ధరణి టౌన్‌షిప్‌లో 60 ఇండ్లు 289 ప్లాట్లను వేలం ద్వారా విక్రయించిందన్నారు. తాము ఒక్కో ఇంటిని రూ.32 లక్షలు వెచ్చించి కొనుగోలు చేస్తే ఇప్పటివరకు ఎలాంటి మౌలిక వసతులు కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి మరమ్మతుల కోసం మరో రూ.15 లక్షలు ఖర్చు చేశామన్నారు. ప్రస్తుతం ధరణి వెంచర్‌లో ఉండకుండా వేరే ప్రాంతంలో అద్దెకు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. తాము కొనుగోలు చేయక ముందు మరమ్మతులు చేసి ఇస్తామని అప్పటి కలెక్టర్ ప్రకటించారని, ఇప్పటి వరకు మరమ్మతులు చేయకపోవడంతో ధరణి టౌన్ షిప్ అడవిని తలపిస్తోందని పేర్కొన్నారు. అధికారులు వెంటనే స్పందించి ధరణి టౌన్‌షిప్‌లో వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

నవంబర్ 8, 9 తేదీల్లో బాలోత్సవం



మాట్లాడుతున్న జయసీ నెహ్రూ

నిజామాబాద్ నాగారం: మోపాల్‌లోని ప్రెసిడెన్సీ స్కూల్‌లో నవంబర్ 8, 9 తేదీల్లో ఇందూరు బాలోత్సవం నిర్వహిస్తున్నట్లు కమిటీ చీఫ్ ప్యాట్రన్ డాక్టర్ జయసీ నెహ్రూ తెలిపారు. ఆదివారం నగరంలోని రెడ్‌క్రాస్ సొసైటీ మీటింగ్ హాల్‌లో జరిగిన రిసెప్షన్ కమిటీ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సైన్స్ మానవాళి అభివృద్ధికి మూల మని దానిని చిన్నప్పటి నుంచే బోధించాలన్నారు. బాలోత్సవ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమయ్య మాట్లాడుతూ పిల్లలు ఒత్తిడితో కాకుండా ఇష్టపడి చదివేలా వాతావరణం ఉండాలన్నారు. చిన్నారుల్లో సృజనాత్మకతను పెంపొందించడానికి ఇందూరు బాలోత్సవం- పిల్లల జాతర తప్పక ఉపయోగపడుతుందన్నారు. డాక్టర్ రవీంద్రనాథ్ సూరి, నర్రా రామారావు, పవన్ కుమార్, బుస్సా ఆంజనేయులు, మదన్ మోహన్, నారాయణ, బన్సీలాల్, రాధాకృష్ణ మధుసూదన్ రావు తదితరులు పాల్గొన్నారు.

• ఘనంగా ఊర పండుగ



డిచ్‌పల్లి ఖిల్లా గ్రామంలో ఊర పండుగ వేడుకల్లో భక్తులు

డిచ్‌పల్లి మండలంలోని డిచ్‌పల్లి ఖిల్లా, ఘన్‌పూర్, కమలాపూర్ గ్రామాల్లో ఆదివారం ఊర పండుగను ఘనంగా జరుపుకున్నారు. గ్రామాభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో గ్రామ దేవతలకు గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. గ్రామ దేవతల ఊరేగింపు సందర్భంగా పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. డప్పు వాయిద్యాలతో గ్రామదేవతలను ఊరేగింపుగా తీసుకెళ్లి ఆలయాల్లో ప్రతిష్ఠించారు. పంటలు బాగా పండాలని, పశుసంపద పెంపొందాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుతూ ప్రతి ఏటా ఆనవాయితీగా ఊర పండుగను జరుపుకుంటామని వీడీసీ సభ్యులు తెలిపారు. – డిచ్‌పల్లి

సర్దుబాటు.. సందిగ్ధం

■ భీమ్‌గల్ మండలంలోని ఓ ప్రాథమిక పాఠశాలలో 80 మంది విద్యార్థులు ఉన్నారు. అక్కడ నలుగురు ఎస్జీటీలు పని చేస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఇచ్చిన ఉపాధ్యాయుల సర్దుబాటు ఉత్తర్వుల ప్రకారం అక్కడ ముగ్గురు టీచర్లు సరిపోతారు. దీంతో ఒకరు ఇతర పాఠశాలకు పోనున్నారు. దీంతో ఇక్కడ విద్యార్థులకు ఇబ్బంది అయ్యే అవకాశం ఉంది. ఉన్న టీచర్లపై పనిభారం పెరుగుతుంది.



- ఉపాధ్యాయుల రేషనలైజేషన్‌కు ప్రభుత్వం ఉత్తర్వులు
- 60 మంది విద్యార్థులకు ఇద్దరు టీచర్ల కేటాయింపు
- వివరాలు సేకరిస్తున్న విద్యాశాఖ అధికారులు
- మండిపడుతున్న ఉపాధ్యాయ సంఘాలు
- పనిభారం పడుతుందని ఆగ్రహం
- ఉత్తర్వులు సవరించాలని డిమాండ్

నిజామాబాద్ అర్బన్: జిల్లాలో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ గందరగోళానికి దారితీస్తోంది. రెండు రోజుల క్రితం రాష్ట్ర విద్యా శాఖ జారీ చేసిన జీవో ప్రకారం టీచర్లను సర్దుబాటు చేస్తే ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బంది పడే అవకాశాలున్నాయి. ఈ ఉత్తర్వుల ప్రకారం 60 మంది విద్యార్థులకు ఇద్దరు టీచర్లు సరిపోతారు. అంతమందికి ఇద్దరు ఎలా సరిపోతారని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే బదిలీ కానీ చాలా మంది ఎస్జీటీలు ఈ ఉత్తర్వులపై మండిపడుతున్నారు. ప్రాథమిక స్థాయిలో సబ్జెక్టుకు ఒక ఒక ఉపాధ్యాయుడి లేదా తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించేలా ఉత్తర్వులను సవరించాలని కోరుతున్నారు.

జిల్లాలోని 726 ప్రాథమిక పాఠశాలల్లో ప్రస్తుతం 2500 మంది ఎస్జీటీలు పనిచేస్తున్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో చాలా మందికి ట్రాన్స్‌ఫర్ అయినా 25శాతం కూడా రిలీవ్ కాని పరిస్థితి ఉంది. దీంతో రాష్ట్ర విద్యాశాఖ రేషనలైజేషన్ నిబంధనలను సవరిస్తూ జీవో నంబర్ 25 ను విడుదల చేసింది. దీని ప్రకారం ప్రాథమిక పాఠశాలల్లో పది మంది విద్యార్థులు ఉంటే ఒక ఉపాధ్యాయుడు ఉండాలి. 11 నుంచి 60 మంది విద్యార్థులు ఉంటే ఇద్దరు టీచర్లు ఉండాలి. ఆ తర్వాత ప్రతి 30 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉండాలని ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలో చాలా ప్రాథమిక పాఠశాలలో సగటున 40 నుంచి 60 మధ్య విద్యార్థులు ఉన్నారు. ఆయా బడుల్లో ఇద్దరికంటే ఎక్కువ మంది సార్లు ఉంటే వేరు చోటుకు సర్దుబాటు కావాల్సిందే. దీంతో ప్రాథమిక పాఠశాలల్లో విద్యా వ్యవస్థ కుంటు పడుతుందని ఉపాధ్యాయ సంఘాల నాయకులు అంటున్నారు. 50 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో నాలుగు సబ్జెక్టులు ఇద్దరు బోధించడం కష్టమని పేర్కొంటున్నారు. ఒక్కరు 9 సబ్జెక్టుల చొప్పున బోధించాలి. అలాగే మధ్యాహ్న భోజనం రికార్డుల నిర్వహణ ప్రధానోపాధ్యాయుల సమావేశాలు, కాంప్లెక్స్ సమావేశాలు హాజరు కావాల్సిందే. వీటికి తోడు యాప్‌లో విద్యార్థుల నమోదు ప్రక్రియ చేయాలి. ఇంత పెద్ద మొత్తంలో ఒత్తిడి ఉన్న ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు బోధనపై దృష్టి పెట్టడం కష్టమని ఉపాధ్యాయులు అంటున్నారు.

రెండు రోజుల్లో నివేదిక

జిల్లాలో సర్దుబాటు ప్రక్రియపై జిల్లా విద్యాశాఖ వివరాలు సేకరిస్తోంది. ఇప్పటికే ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయాలని ఆదేశించింది. రెండు రోజుల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వివరాలతో నివేదికను కలెక్టర్‌కు అందించనున్నారు. ఆయన అనుమతితో సర్దుబాటు ప్రక్రియ ప్రారంభించడానికి విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

పునరాలోచించాలి

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రైవేట్ పాఠశాలల్లో ప్రాథమిక స్థాయిలో కూడా తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమిస్తూ నాణ్యమైన విద్యను అందించడానికి పోటీ పడుతున్నాయి. కానీ ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువ మంది విద్యార్థులు ఉన్నా ఒకరిద్దరితో నెట్టుకొస్తున్నారు. దీంతో విద్యార్థులకు బోధన సక్రమంగా జరగడం లేదు. ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి తరగతికి లేదా సబ్జెక్ట్‌కు ఒక టీచర్‌ను ఇవ్వాలని ఎస్జీటీలు ఎన్నో సార్లు వినతిపత్రాలు అందజేశారు. ఈ వినతులను పక్కన పెడుతూ రెండు రోజుల క్రితం విద్యాశాఖ హేతుబద్ధీకరణ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ జీవోతో ప్రాథమిక పాఠశాలల ఉనికి ప్రశ్నార్థకంగా మారుతుందని ఉపాధ్యాయులు అంటున్నారు. ప్రభుత్వం పునరాలోచన చేసి ఉత్తర్వులను సవరించి తరగతికి ఒక టీచర్‌ను, ప్రాథమిక పాఠశాలకు ఒక పీఎస్ హెచ్‌ఎంను కేటాయించాలని కోరుతున్నారు.

పాఠశాలలను నిర్వీర్యం చేసేలా..



రాష్ట్ర విద్యాశాఖ రెండు రోజుల క్రితం విడుదల చేసిన జీవో ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేసే విధంగా ఉంది. మొదట డీఎస్సీ ద్వా ఉపాధ్యాయులను నియమించి ఆ తర్వాత సర్దుబాటు చేయాలి. ఉత్తర్వులను సవరించి 15 మంది విద్యార్థులకు ఒక ఎస్జీటీని కేటాయించాలి. ప్రతి ప్రాథమిక పాఠశాలకు ఒక ప్రధానోపాధ్యాయుడిని నియమించాలి.
– అంకం నరేశ్, పీఆర్‌టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు

డిప్యుటేషన్లపై ఎమ్మెల్యే ఆగ్రహం

నిజామాబాద్ అర్బన్: నవీపేట మండలం బినోల ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడ పోటీలకు డిప్యుటేషన్‌పై వెళ్లిన ఉపాధ్యాయులు గైర్హాజరు కావడంపై మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సీరియస్ అయినట్లు తెలిసింది. మండల స్థాయి ఆటల పోటీలకు 64 మంది ఉపాధ్యాయులను కేటాయించారు. ఇందులో 20 మంది మాత్రమే క్రీడ పోటీల విధుల్లో పాల్గొన్నారు. మిగతా వారు గైర్హాజరయ్యారు. వరుసగా మూడు రోజులపాటు పాఠశాలకు, ఆటల పోటీలకు వెళ్లలేదు. తన నియోజకవర్గంలో ఆటల పోటీల్లో ఇంత మంది టీచర్లకు డిప్యుటేషన్ వేయడం ఏమిటని ప్రశ్నించినట్లు తెలిసింది. వివరాలు ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించగా కలెక్టర్ అనంతరం డీఈవోను నివేదిక సమర్పించాలని ఆదేశించారు. దీంతో డీఈవో ఈ ఘటనపై ఎంఈవో, సంబంధిత టీచర్లపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. తక్షణమే ఎంత మంది గైర్హాజరయ్యారు, వివరణ ఇవ్వాలని నవీపేట ఎంఈవో, బినోల ప్రధానోపాధ్యాయుడికి ఆదేశాలు జారీ చేశారు. విధులకు గైర్హాజరైన టీచర్లకు ఆన్‌డ్యూటీకి బదులు అర్హత సెలవులు మంజూరు చేయాలని డీఈవో ఆదేశాలు జారీ చేశారు. అలాగే జక్రాన్‌పల్లి మండలంలో జరిగే మండల స్థాయి క్రీడ పోటీలకు టీచర్ల డిప్యుటేషన్లను రద్దు చేశారు. అవసరమైన మేరకే టీచర్లను కేటాయించాలని ఆదేశించారు. ఎస్‌జీఎఫ్ నిర్వాహకులపై డీఈవో దుర్గప్రసాద్ మండిపడ్డారు. అనవసరంగా డిప్యుటేషన్లను కేటాయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉపాధ్యాయ సంఘాల మండిపాటు

బినోలలో క్రీడలకు 64 మంది టీచర్లు కాకుండా నవీపేట ఎంఈవో గణేశ్‌రావు మరో 28 మంది టీచర్లకు మండల పరిధిలో డిప్యుటేషన్ వేశారు. మండల స్థాయి ఆటల పోటీలకు 92 మంది టీచర్లను కేటాయించడంపై పలు ఉపాధ్యాయ సంఘాల నాయకు లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందులో ఒకే సంఘానికి చెందిన వారిని వివిధ మండలాల నుంచి డిప్యుటేషన్లు కేటాయించడం సరైంది కాదని వారు పేర్కొన్నారు. పీఈటీలు, పీడీలు పూర్తి స్థాయిలో కేటాయిస్తే సరిపోతుందని సొంత మండలం నుంచి మరికొంత మంది టీచర్లను కేటాయిస్తే సరిపోతుందని వారు పేర్కొన్నారు. కానీ జిల్లాలోని వివిధ మండలాల నుంచి సబ్జెక్టు టీచర్లను కేటాయించడంపై మండిపడుతున్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని వారు పేర్కొన్నారు.

మక్క రైతును వెంటాడుతున్న వర్షం



ముప్కాల్‌లో తడిసిన మక్కలు

బాల్కొండ: మక్క రైతులను వర్షాలు వెంటాడుతున్నాయి. వర్షానికి రోడ్లపై ఆరబెట్టిన మక్కలు మొత్తం తడిసి ముద్దయ్యాయి. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి తడిసిన మక్కలను శనివారం ఉదయం నుంచి రైతులు ఆరబెట్టారు. తీరా మధ్యాహ్నం మళ్లీ వాన పడటంతో తడిసిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం కూడా పలు ప్రాంతాల్లో వర్షం కురిసి మక్కలు తడిసిపోయాయి. ప్రస్తుతం మక్క నూర్పిళ్లు జోరుగా సాగుతున్నాయి. కానీ వర్షాలు పడుతుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పంటలు సాగు చేసిన సమయంలో వర్షాలు పడక రైతులు అనేక ప్రయత్నాలు చేసి పంటకు నీరు అందిస్తారు. చివరకు పంట చేతి కొచ్చాక వర్షాలు కురిసి పంటను పాడు చేస్తున్నాయని వారు వాపోతున్నారు. అసలే వ్యాపారులు సిండికేటుగా మారి మక్కల ధర తగ్గించారు. ప్రస్తుతం వానలు పడుతుండటంతో మరింద ధర తగ్గిస్తారని రైతులు ఆందోళన చెందుతున్నారు.

నాలుగు రోజులుగా తడుస్తున్నాయి



నాలుగు రోజులుగా రోజు వర్షం కురుస్తుంది. దీంతో రోడ్డుపై ఆరబెట్టిన మక్కలు తడుస్తున్నాయి. దీంతో మక్కలు రంగు మారాయి. మొలకెత్తే ప్రమాదం కూడా ఉంది. ఇదివరకే వ్యాపారులు ధర తగ్గించారు. – బోదేపల్లి లింబాద్రి, రైతు

ప్రాణాలు తీస్తున్న రీల్స్

• లైక్‌ల కోసం ప్రమాదకరంగా విన్యాసాలు

ఖలీల్‌వాడి: సోషల్ మీడియాలో పాపులారిటీ కోసం యువత ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. రీల్స్, షార్ట్స్ చేసి ఫేమస్ కావాలని ప్రమాదకరంగా విన్యాసాలు చేస్తున్నారు. అందరి కంటే తమ వీడియోలు భిన్నంగా ఉండాలని చేసే సహస ప్రయత్నాల్లో కొందరు ప్రాణాలు కోల్పోతుంటే మరి కొందరు గాయాలపాలవుతున్నారు. స్మార్ట్‌ఫోన్లు వచ్చిన తర్వాత సోషల్ మీడియాకు ప్రాధాన్యం పెరిగింది. అందులోనూ రీల్స్‌కు క్రేజ్ పెరిగింది. చిన్న పిల్లల నుంచి ముసలి వారు చాలా మంది వివిధ రకాల రీల్స్‌ను అప్‌లోడ్ చేస్తున్నారు. లైక్‌లు, షేర్లు, వీక్షకుల సంఖ్య పెరిగితే మంచి గుర్తింపు వస్తుందని ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ప్రయత్నాలు ప్రాణాల మీదుకు తెస్తున్నాయి. ఈ రీల్స్ తీయడానికి ఎంత దూరమైనా వెళ్లి సాహసాలు చేస్తున్నారు. అడవులు, పెద్దభవనాలు, ఎత్తైనా చెట్లు, ప్రమాదకరమైన నీటి ప్రాంతాలలో వీడియోలు, సెల్ఫీలు తీసుకుంటున్నార. దీంతో తల్లిదండ్రులకు గుండెకోతను మిగిలిస్తున్నారు.

భిన్నంగా ఉండాలని..

జిల్లాలోనూ యువత రీల్స్ చేస్తున్నారు. కొందరు యువకులు బైక్‌లపై స్పీడ్‌గా వెళ్తూ స్టంట్‌లు చేస్తున్నారు. ప్రాజెక్టులు, చెరువుల దగ్గర రీల్స్, సెల్ఫీలు దిగుతున్నారు. ఇతరుల కంటే తమ వీడియోలు, ఫొటోలు భిన్నంగా ఉండాలని సాహసాలు చేస్తున్నారు.



జిల్లాలో జరిగిన పలు ఘటనలు

■ ఇటీవల మెండోరా మండలంలో రీల్స్ కోసం ఓ యువకుడు ట్రాక్టర్‌తో పొలాల్లో స్టంట్స్ చేస్తుండగా ట్రాక్టర్ బోల్తా పడి మృతి చెందాడు.

■ గతేడాది శ్రీరాంసాగర్ చూడటానికి వచ్చిన నిర్మల్‌కు చెందిన ఇద్దరు సెల్ఫీలు దిగుతూ నీట మునిగి చనిపోయారు.

■ రెండేళ్ల క్రితం ఎడపల్లి మండలం అలీసాగర్‌లో కొందరు నీటిలో దిగి సెల్ఫీలు తీసుకుంటుండగా 16 ఏళ్ల వయస్సు గల ముగ్గురు నీట మునిగి మృతి చెందారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

రీల్స్ చేసే వారు ప్రమాదకరమైన ప్రాంతాల్లో వీడియోలు చేయొద్దు. మంచి కంటెంట్ ఉంటే వీక్షకులు పెరుగుతారు. లోతు ప్రాంతాల్లో ఫొటోలు దిగే ప్రయత్నం చేయొద్దు. తల్లిదండ్రులు పిల్లల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ప్రమాదకరంగా విన్యాసాలు చేసి అప్‌లోడ్ చేస్తే మందలించాలి. టీనేజ్ పిల్లలు సోషల్ మీడియాలో ఎక్కువ సమయం గడపకుండా చూడాలి. పోలీసులు కూడా పాఠశాలలు, కాలేజీల్లో అవగాహన కల్పించాలి.

జీపీల్లో వేతన వెతలు

■ కమ్మర్‌పల్లి గ్రామ పంచాయతీలో పని చేస్తున్న 15 మంది కార్మికులు తమకు వేతనాలు చెల్లించడం లేదని గురువారం ఆందోళన చేశారు. రెండు నెలల వేతనం బకాయిలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా సిబ్బంది వేతనాలకు సంబంధించిన చెక్కును పంచాయతీ కార్యదర్శి ట్రెజరీకి పంపించగా ఫ్రీజింగ్ కారణంగా ఒక నెల వేతనం జమ కాలేదని తెలిసింది. ఈ లెక్కన నెల వేతనం బకాయి ఉందని జీపీ కార్యదర్శి శాంతికుమార్ వివరణ ఇచ్చారు. చివరకు కార్మికుల ఆవేదన అర్థం చేసుకుని నెల వేతనం వెంటనే చెల్లించారు.



- జమ కాని ఎస్ఎఫ్‌సీ నిధులు
- ట్రెజరీకి పంపిన చెక్కుల చెల్లింపులకు ఫ్రీజింగ్ బెడద
- ఆదాయం లేకపోవడంతో కార్మికులకు జీతాల చెల్లింపులలో తీవ్ర జాప్యం

మోర్తాడ్: గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులు జీతాలు అందక అవస్థలు పడుతున్నారు. జిల్లాలోని అనేక పంచాయతీల ఖాతాలు ఖాళీగా ఉండటంతో వేతనాలకు కటకట ఏర్పడింది. జిల్లాలో 530 పాత పంచాయతీలు కొత్తగా ఏర్పడిన 15 పంచాయతీలు ఉన్నాయి. మేజర్ పంచాయతీల్లోనూ పన్నుల ఆదాయం విద్యుత్ బిల్లు, ట్రాక్టర్, ట్రాలీ కిస్తులు ఇలా ఎన్నో రకాల చెల్లింపులకు సరిపోతుంది. ఇక చిన్న పంచాయతీలు కార్మికుల వేతనాలకు ఎస్ఎఫ్‌సీ నిధుల కోసం ఎదురు చూడాల్సి వస్తుంది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఆగస్టులో ఎస్ఎఫ్‌సీ నిధులు జమ అయ్యాయి. వీటిని వేతనాల కోసం వినియోగించినా కొన్ని నెలల వేతనం ఇంకా బాకీ ఉంది. గ్రామ పంచాయతీలలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు జీతాల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతోంది.

రాష్ట్ర ఆర్థిక సంఘం(ఎస్ఎఫ్‌సీ) నిధులు జమ కాకపోవడం, పంచాయతీల ఆదాయం అంతంత మాత్రంగానే ఉండటంతో విపత్కరమైన పరిస్థితులు నెలకొన్నాయి. 15వ ఆర్థిక సంఘం ద్వారా కేంద్రం ప్రతి నెలా రూ.10.30 కోట్ల నిధులను పంచాయతీలకు విడుదల చేయాల్సి ఉంది. ఎస్ఎఫ్‌సీ కూడా అంతే మొత్తంలో జమ చేస్తామని గత ప్రభుత్వం నిర్ణయించింది. ఆచరణలో మాత్రం పూర్తి స్థాయిలో అమలు చేయలేదు. ఎస్ఎఫ్‌సీ నిధులు క్రమం తప్పకుండా విడుదల చేస్తేనే పంచాయతీలకు ఉపశమనం లభించే అవకాశం ఉంది.

సకాలంలో చెల్లించేలా చూస్తాం

పంచాయతీ కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించేలా చూస్తాం. ఎస్ఎఫ్‌సీ నిధులు విడుదలైతే ఎలాంటి ఇబ్బంది ఉండదు. కొన్ని పంచాయతీల్లోనే ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయి. పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేస్తున్నాం.
– తరుణ్‌కుమార్, జిల్లా పంచాయతీ అధికారి

క్లుప్తంగా

గ్రూప్‌-2 అభ్యర్థులకు సన్నాహక పరీక్ష

నిజామాబాద్‌ అర్బన్‌: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం హైదరాబాద్‌కు చెందిన షైన్‌ ఇండియా అకాడమీ ఆధ్వర్యంలో గ్రూప్‌–2 అభ్యర్థులకు సన్నాహక పరీక్ష నిర్వహించారు. 60 మంది విద్యార్థులు ఈ పరీక్ష రాశారు. కార్యక్రమంలో జిల్లా కేంద్ర గ్రంథాలయ డిప్యూటీ లైబ్రేరియన్‌ రాజిరెడ్డి, అసిస్టెంట్‌ లైబ్రేరియన్‌ తారకం, షైన్‌ ఇండియా డైరెక్టర్‌ సయీద్‌, అభిలాష్‌, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

నిజామాబాద్‌ అర్బన్‌: ప్రభుత్వ జూనియర్‌ లెక్చరర్ల అసోసియేషన్‌ నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికైంది. జిల్లా కేంద్రంలో కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఎన్నుకున్నారు. అసోసియేషన్‌ అధ్యక్షుడిగా సీహెచ్‌ నర్సయ్య, ఉపాధ్యక్షుడిగా జఫర్‌, కార్యదర్శిగా వై నారాయణ, జాయింట్‌ సెక్రటరీగా సురేష్‌ బాబు, కోశాధికారిగా ఎంఎస్‌వీ ప్రసాద్‌, మహిళా సెక్రటరీగా పవనశ్రీ, రాష్ట్ర సెక్రటరీగా ఫహిమొద్దీన్‌, ఈసీ మెంబర్లుగా ప్రకాశ్‌, తులసీదాస్‌, సురేష్‌, అరవింద్‌ ఎన్నికయ్యారు.

పోలీసుల అదుపులో గంగపుత్ర సంఘం సభ్యులు



రుద్రూర్‌: మండలంలోని రాణంపల్లి శివారులో ఆదివారం గంగపుత్ర సంఘం అభివృద్ధి కమిటీ జిల్లా సభ్యులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కోటగిరి మండలం రాంపూర్‌లో ఇటీవల గాయపడ్డ గంగపుత్రులను పరామర్శించేందుకు వెళ్తున్న 9మంది సభ్యులను అదుపులోకి తీసుకుని రుద్రూర్‌ పీఎస్‌కు తరలించారు. అనంతరం వారి వివరాలు సేకరించి విడుదల చేశారు. పీఎస్‌ ఆవరణలో గంగపుత్ర సంఘం సభ్యులు మాట్లాడుతూ.. రాంపూర్‌లో ఇటీవల జరిగిన ఘర్షణలో గాయపడ్డ సంఘ సభ్యులను పరామర్శించేందుకు వెళ్తున్న తమను మధ్యలోనే నిలిపివేయడం అప్రజాస్వామికమని జిల్లా కమిటీ సభ్యులు బాల గంగాధర్‌ తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. రాంపూర్‌లో మైనారిటీలుగా ఉన్న గంగపుత్రులపై దాడులు జరుగుతున్నాయని, వీటిని అరికట్టాలని డిమాండ్‌ చేశారు.

జాతీయ స్థాయికి ఎదగాలి



పెర్కిట్‌: విద్యార్థులు క్రీడల్లో రాణించి జాతీయ స్థాయికి ఎదగాలని రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్‌ తాహెర్‌బిన్‌ హందాన్‌ అన్నారు. ఆలూరు మండల కేంద్రంలో నిర్వహిస్తున్న అంతర్‌ పాఠశాలల క్రీడా పోటీలు ఆదివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించడానికి అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్మూర్‌ ఏసీపీ బస్వారెడ్డి, ఎంఈవో రాజ గంగారాం, హెచ్‌ఎం కుంట శ్రీనివాస్‌ రెడ్డి పాల్గొన్నారు.

టెండర్లు పిలిచేదెప్పుడో..?

- మున్సిపల్‌ దుకాణ సముదాయాలకు ముగిసిన లీజు గడువు
- నోటీసులతో సరిపెట్టిన అధికారులు



బోధన్‌ మున్సిపల్‌ కార్యాలయం

బోధన్‌టౌన్‌: బోధన్‌ మున్సిపాలిటీకి ఆర్థిక వనరుగా ఉన్న దుకాణాల సముదాయం లీజు గడువు ముగిసి 6 నెలలు కావస్తున్నా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. బోధన్‌ మున్సిపల్‌ ఆర్థికంగా పరిపుష్టి సాధించడంతో పాటు ఆదాయం సమకూర్చేందుకు ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం 1998లో పట్టణంలోని అంబేడ్కర్‌ చౌరస్తాతో పాటు, పాత బస్టాండ్‌లోని వీక్లీ మార్కెట్‌లో 72 దుకాణ సముదాయాలను రూ. కోట్లు వెచ్చించి నిర్మించింది. ఈ దుకాణ సముదాయాలకు టెండర్‌ ప్రాతిపదికన 25 ఏళ్ల కాల పరిమితిని ఏర్పాటు చేసి టెండర్‌ ప్రక్రియ నిర్వహించారు. టెండర్‌ ప్రక్రియలో పాల్గొని దుకాణాలు దక్కించుకున్నవారికి వాటిని అప్పగించారు.

అంబేడ్కర్‌ చౌరస్తాలో 30 దుకాణాలు..

అంబేడ్కర్‌ చౌరస్తాలో మున్సిపల్‌కు చెందిన 30 దుకాణ సముదాయాలు ఉన్నాయి. కింది భాగంలో 26 సముదాయాలు, పైభాగంలో గల 4 దుకాణాలు ఉన్నాయి. ఇందులో కింది భాగంలోని 26 దుకాణాలు 25 ఏళ్ల పాటు లీజుకు అప్పగించారు. పైభాగంలో ఉన్న గదుల్లో మెప్మా కార్యాలయం కొనసాగుతోంది. దుకాణ సముదాయాల్లోని ఒక్కో దుకాణం అద్దె రూ. 2వేల నుంచి ప్రారంభమై ప్రస్తుతం రూ. 7,529 వరకు కేటాయించి వసూలు చేస్తున్నారు.

ముగిసిన 23 దుకాణాల లీజు

అంబేడ్కర్‌ చౌరస్తాలో కింది భాగంలో ఉన్న దుకాణ సముదాయాల్లో 26 దుకాణాలకు ఈ ఏడాది ఆర్థిక సంవత్సరం ముగింపు మార్చి నెల 31వ తేదీతో 25 ఏళ్ల లీజు గడువు ముగిసింది. లీజు గడువు ముగిసిన దుకాణాలను బల్దియా అధికారులు సొంతం చేసుకొని నూతన టెండర్‌ ప్రక్రియను నిర్వహించాలి. ఆరు నెలలు కావస్తున్నా అధికారులు టెండర్‌ నిర్వహించడం లేదు. దీంతో దుకాణసముదాయాలు అలాగే కొనసాగుతున్నాయి. అధికారుల తీరుపై ప్రజల్లోఅనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అద్దె బకాయిలు అడ్డుగా నిలుస్తున్నాయా?

అంబేడ్కర్‌ చౌరస్తాలో ఉన్న 26 దుకాణ సముదాయాల్లో 23 దుకాణాల లీజు గడువు ముగిసినా ఈ దుకాణాల్లో బల్దియాకు చెల్లించాల్సిన అద్దె బకాయిలు ఉన్నాయి. లీజు గడువుకు 6 నెలల ముందు నుంచే బకాయి అద్దె వసూళ్లపై బల్దియా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి బకాయి వసూళ్లను వేగవంతం చేశారు. అద్దె బకాయిలు పూర్తి స్థాయిలో వసూలు కాకపోవడంతో టెండర్‌ నిర్వహించాల్సిన అధికారులు మౌనం వహిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఆశావహుల ఎదురు చూపు

పట్టణంలోని అంబేడ్కర్‌ చౌరస్తాలో నిర్మించిన దుకాణ సముదాయాల 25 ఏళ్ల లీజు గడువు ముగియడంతో ఆశావహులుఎదురు చూస్తున్నారు. గడువు ముగిసిన దుకాణాలకు తిరిగి టెండర్లు నిర్వహిస్తే వాటిని దక్కించుకునేందుకు గతంలో ఉన్న వారు, కొత్త వ్యాపారులు, నిరుద్యోగ యువకులు ఎదురు చూస్తున్నారు.

నోటీసులు అందించాం



పట్టణంలోని అంబేడ్కర్‌ చౌరస్తాలో నిర్మించిన 26 దుకాణాల్లో 23 దుకాణాల లీజు గడువు మార్చి 31కి ముగిసింది. లీజు గడువు ముగిసిన దుకాణాలకు నోటీసులు అందించాం. గడువు ముగిసిన దుకాణాలను ఖాళీ చేయించే దిశగా ప్రక్రియ కొనసాగుతోంది.

– వెంకట నారాయణ, మున్సిపల్‌ కమిషనర్‌

పరిశుభ్రతలో పిల్లలను భాగస్వామ్యం చేయాలి



మినీట్యాంక్‌ బండ్‌పై శుభ్రం చేస్తున్న అధికారులు, సిబ్బంది

నిజామాబాద్‌నాగారం: ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటిస్తూ అందులో తమ పిల్లలను కూడా భాగస్వాములను చేయాలని జిల్లా స్వచ్ఛ భారత్‌ నోడల్‌ అధికారి, సీనియర్‌ స్టాటిస్టికల్‌ అధికారి భరత్‌రాజ్‌ అన్నారు. జాతీయ గణాంక, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రఘునాథ చెరువు వద్ద ఉన్న మినీ ట్యాంక్‌ బండ్‌పై ఆదివారం స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గాంధీ కలలు కన్న స్వచ్ఛత అమలు కోసం ప్రధాని నరేంద్ర మోదీ 2014లో స్వచ్ఛ భారత్‌ అభియాన్‌ కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. స్వచ్ఛత పరిసరాల పరిశుభ్రతతో అందరూ మంచి ఆరోగ్యాన్ని, ఆహ్లాదకరమైన జీవనాన్ని పొందవచ్చని అన్నారు. సీనియర్‌ స్టాటిస్టికల్‌ ఆఫీసర్‌ ప్రవీణ్‌ కుమార్‌ మాట్లాడుతూ.. డెంగీ, మలేరియా, టైఫాయిడ్‌లాంటి విషజ్వరాల బారిన పడకుండా ఉండాలంటే స్వచ్ఛత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో నిజామాబాద్‌ మున్సిపల్‌ ఏఈ నటరాజ్‌ గౌడ్‌, నిరంకార్‌ వర్మ, అనుజ్‌ కుమార్‌, జూనియర్‌ స్టాటిస్టికల్‌ అధికారులు, సర్వే సూజర్‌వైజర్లు, సర్వే ఎన్యుమరేటర్స్‌ పాల్గొన్నారు.

నేడు డీఎస్‌ స్మారకార్థం జిల్లాస్థాయి పోటీలు

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్‌ స్పోర్ట్స్‌ ప్రమోషన్‌ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 23నుంచి 27వరకు ధర్మపురి శ్రీనివాస్‌ స్మారకార్థం పోటీలను నిర్వహించనున్నట్లు సభ్యుడు డి సాయిలు ఆదివారం తెలిపారు. ఈ పోటీలు సొసైటీ అధ్యక్షుడు ధర్మపురి సంజయ్‌ ఆధ్వర్యంలో కొనసాగుతాయని అన్నారు. పోటీలు పాత కలెక్టరేట్‌ మైదానంలో జరుగుతాయన్నారు. ఖోఖో, వాలీబాల్‌, బాస్కెట్‌బాల్‌ పోటీలు ఉంటాయన్నారు. సోమవారం ఉదయం 10గంటలకు మార్చ్‌పాస్ట్‌తో పోటీలు ప్రారంభమవుతాయని అన్నారు. 27న ముగింపు కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

తైక్వాండో క్రీడాకారులకు బెల్ట్‌ల ప్రదానం



నిజామాబాద్‌నాగారం: నగరంలోని వినాయక్‌నగర్‌లో ఉన్న బస్వాగార్డెన్‌లో జిల్లా తైక్వాండో కార్యదర్శి, కోచ్‌ మనోజ్‌ ఆధ్వర్యంలో క్రీడాకారులకు ఆదివారం బెల్టుల పరీక్ష నిర్వహించారు. 80 మంది తమ ప్రతిభను ప్రదర్శించి బెల్టులు సాధించారు. అసోసియేషన్‌ చైర్మన్‌ బస్వా లక్ష్మీనర్సయ్య, ఒలింపిక్‌ సంఘం చైర్మన్‌ లింగన్న చేతుల మీదుగా క్రీడాకారులకు బెల్టులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జీజీహెచ్‌ సూపరింటెండెంట్‌ ప్రతిమారాజ్‌, నిజామాబాద్‌ డిస్ట్రిక్ట్‌ తైక్వాండో అసోసియేషన్‌ కోశాధికారి వెంకటరమణ గౌడ్‌, వైస్‌ ప్రెసిడెంట్‌ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

పీసీసీ చీఫ్‌ను కలిసిన నాయకులు



నిజామాబాద్‌ సిటీ: తెలంగాణ (పీసీసీ) ప్రదేశ్‌ కాంగ్రెస్‌ కమిటీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌ కుమార్‌ గౌడ్‌ను హైదరాబాద్‌లో ఆదివారం ఖానాపూర్‌ కాంగ్రెస్‌ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆయనను సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్పొరేటర్‌ కొర్వ లలిత, మాజీ సర్పంచ్‌ కొర్వ గంగాధర్‌, నాయకులు కొర్వ కోటయ్య, సాలుగారి సాయన్న, గంగాధర్‌, మోహన్‌ తదితరులు ఉన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న బాన్సువాడ జూనియర్‌ కళాశాల విద్యార్థులు

అ‘పూర్వ’ సమ్మేళనం

బాన్సువాడ/ నిజామాబాద్‌ రూరల్‌: బాన్సువాడ ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో 1992–94లో ఇంటర్‌ చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 30 ఏళ్ల క్రితం ఇంటర్‌ చదివిన విద్యార్థులు ఒకే చోట కలవడంతో సంతోషం వ్యక్తం చేశారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు జపాల భాస్కరశర్మ, భవాని ప్రసాద్‌, కృష్ణారెడ్డి, డాకయ్య, రజాక్‌, గంగారెడ్డి, శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు. నిజామాబాద్‌ జిల్లా కేంద్రంలోని వివేకానంద విద్యాలయానికి చెందిన 1999–2000లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 25 వసంతాలు పూర్తిచేసుకున్న నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని లహరి ఇంటర్నేషనల్‌ హోటల్‌లో సమ్మేళనం చేపట్టారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సామశివకుమార్‌, స్వప్న, ఆజాద్‌, సునీత, రవి, రాజేందర్‌, ప్రశాంత్‌, సాలుగారి మోహన్‌, ప్రధానోపాధ్యాయులు రవికాంత్‌, శివకుమార్‌, శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న వివేకానంద విద్యాలయ పూర్వ విద్యార్థులు

పార్టీని నమ్ముకుంటే ఫలితం దక్కింది

- నిజామాబాద్‌ ఏఎంసీ డైరెక్టర్‌ నరేందర్‌ కుమార్‌



ఎలిగేటి నరేందర్‌ కుమార్‌

సుభాష్‌నగర్‌: బడుగు, బలహీనవర్గానికి చెందిన తాను ఎన్‌ఎస్‌యూఐ, యూత్‌ కాంగ్రెస్‌, ఆ తర్వాత కాంగ్రెస్‌ పార్టీని నమ్ముకుని పని చేసినందుకు నిజామాబాద్‌ వ్యవసాయ మార్కెట్‌ కమిటీ డైరెక్టర్‌గా నియమించడం సంతోషంగా ఉందని ఎలిగేటి నరేందర్‌ కుమార్‌ ఆదివారం పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే ఎన్‌ఎస్‌యూఐలో పని చేశానని, యూత్‌ కాంగ్రెస్‌లో పని చేస్తూ తెలంగాణ ఉద్యమంలో పని చేశానని గుర్తుచేశారు. మార్కెట్‌ కమిటీ చరిత్రలో ట్రేడర్‌ విభాగంలో ఎన్నడూ లేని విధంగా బడుగు, బలహీనవర్గానికి చెందిన తనకు డైరెక్టర్‌గా అవకాశం కల్పించారని, గతంలో కేవలం పెద్ద వ్యాపారులకు మాత్రమే అవకాశమిచ్చారని గుర్తుచేశారు. 15 ఏళ్లుగా కూరగాయల మార్కెట్‌లో హోల్‌సేల్‌ ట్రేడర్‌గా కొనసాగుతున్నానని, రైతులు, వ్యాపారులు ఎదుర్కొనే సమస్యలు, వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని నరేందర్‌ పేర్కొన్నారు. కూరగాయల మార్కెట్‌లో వ్యాపారం చేసుకుంటున్న తనను గుర్తించి ట్రేడర్‌ విభాగంలో డైరెక్టర్‌గా గుర్తించిన బోధన్‌, నిజామాబాద్‌ రూరల్‌ ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

క్వార్టర్‌ ఫైనల్‌కు చేరిన జిల్లా జట్లు

నిజామాబాద్‌నాగారం: రాజన్న సిరిసిల్లా జిల్లాలో కొనసాగుతున్న రాష్ట్రస్థాయి జూనియర్‌ సాఫ్ట్‌బాల్‌ పోటీల్లో జిల్లా బాలబాలికల జట్లు క్వార్టర్‌ ఫైనల్‌కు చేరినట్లు జిల్లా సాఫ్ట్‌బాల్‌ అసోసియేషన్‌ అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్‌, గంగామోహన్‌ ఆదివారం తెలిపారు. జట్టుకు కోచ్‌ మేనేజర్లుగా రాజ్‌ కుమార్‌, ఈ నరేశ్‌, ఎం సుజాత, భూలబాయ్‌ వ్యవహరిస్తున్నారు.



జిల్లా బాలబాలికల జట్లు

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పెద్దకొడప్‌గల్‌ పీఎస్‌లో ఉన్న ట్రాక్టర్లు

పెద్దకొడప్‌గల్‌: ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై మహేందర్‌ ఆదివారం తెలిపారు. అబ్జల్‌ గ్రామానికి చెందిన కొందరు ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో పెద్దకొడప్‌గల్‌ జాతీయ రహదారిపై పట్టుకొని పీఎస్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి, తహసీల్దార్‌కు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

పొతంగల్‌ శివారులో ఇసుక టిప్పర్‌..

రుద్రూర్‌: కోటగిరి పీఎస్‌ పరిధిలోని పొతంగల్‌ మండలంలో మంజీరా నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు దినం కావడంతో అక్రమార్కులు మంజీరా నది పరివాహక ప్రాంతాల నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. వీటిపై ప్రత్యేక దృష్టి సారించిన పొతంగల్‌ తహసీల్దార్‌ మల్లయ్య అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న వాహనాలను, ఇసుక డంప్‌లను సీజ్‌ చేసి జరిమానా విధిస్తున్నారు. అయినా అక్రమార్కులు తమ దందా కొనసాగిస్తున్నారు. డివిజన్‌ స్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఇసుక రవాణాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఇసుక డంప్‌ స్వాధీనం

రుద్రూర్‌: కోటగిరి పీఎస్‌ పరిధిలోని పొతంగల్‌ మండలం శేషాద్రి ఫారం నుంచి సుంకిని వెళ్లే దారిలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌ను తహసీల్దార్‌ మల్లయ్య ఆదివారం సీజ్‌ చేశారు. ఈ డంప్‌లో సుమారు పది ట్రాక్టర్ల ట్రిప్పుల ఇసుక ఉంటుందని పేర్కొన్నారు.

కల్లు సీసాలో పురుగులు



పురుగులు ఉన్న కల్లుసీసా

కామారెడ్డి రూరల్‌: కామారెడ్డి మున్సిపల్‌ పరిధిలోని అడ్లూర్‌లో ఉన్న కల్లు డిపోలో ఆదివారం ఓ కల్లు సీసాలో పురుగులు రావడంతో గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. ఎల్లమ్మ ఆలయం వద్ద ఉన్న కల్లు డిపో వద్ద కొందరు కల్లు తాగుతుండగా సీసాలో జలగ, నట్టలు(పురుగులు) వచ్చాయి. దీంతో ఆగ్రహించిన వారు విక్రయదారులను నిలదీశారు. ప్రతి రోజు సీసాలను కడకపోవడంతోనే కల్లు సీసాల్లో పురుగులు, జలగలు వస్తున్నాయని ఆరోపించారు. అయితే విక్రయదారులను నిలదీస్తే నిర్లక్ష్యపు సమాధానం ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా మండల పరిధిలోని రామేశ్వర్‌పల్లి, ఇందిరానగర్‌ కాలనీ, క్యాసంపల్లి, ఇస్రోజివాడి గ్రామాల్లో సైతం కల్లు సీసాలు శుభ్రం చేయడం లేదని, ఇష్ట రీతిన కల్తీకల్లు విక్రయిస్తున్నారని ఇదేమిటని అడిగితే నిర్వాహకులు సైతం నిర్లక్ష్యంగా సమాధానాలు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్సైజ్‌ అధికారులు స్పందించి కల్లు దుకాణాలపై దాడులు నిర్వహించి నాణ్యమైన కల్లు విక్రయించేలా చూడాలని కల్లు ప్రియులు కోరుతున్నారు.

పిప్రిలో చోరీ



ఆర్మూర్‌టౌన్‌: మండలంలోని పిప్రి గ్రామంలో దుంపల కవిత ఇంట్లో దుండగులు శనివారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారు. కవిత శనివారం రాత్రి ఇంటికి తాళం వేసి పక్కింట్లో నిద్రించింది. ఉదయం చూసే సరికి ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించిన కవిత పోలీసులకు సమాచారం అందించింది. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. బీరువాలో ఉన్న 13 గ్రాముల బంగారం, పది తులాల వెండి, రూ.లక్షా70వేల నగదు చోరీకి గురైనట్లు బాధితురాలి తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు.

పేకాట స్థావరాలపై దాడి

ఆర్మూర్‌టౌన్‌/ నందిపేట్‌: ఆలూర్‌ మండల కేంద్రంలో టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు ఆదివారం పేకాట స్థావరంపై దాడి చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు ఆలూర్‌ శివారులో పేకాట ఆడుతున్న స్థావరంపై దాడి చేసి ఐదుగురిని పట్టుకొని వారి నుంచి రూ.16 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం వీరిని పీఎస్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో రవికుమార్‌ పేర్కొన్నారు. నందిపేట మండలం తల్వేద శివారులో టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు ఆదివారం పేకాట స్థావరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న ముగ్గురిని పట్టుకున్నారు. వారి నుంచి రూ.15100 నగదును స్వాధీనం చేసుకొని అరెస్టు చేసినట్లు ఎస్సై హరిబాబు తెలిపారు.

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలో ఒకటో టౌన్‌ పీఎస్‌ పరిధిలో ఉన్న నాగేంద్రుడుని గుడి వెనుకాల ఆడుతున్న పేకాట స్థావరంపై పోలీసులు దాడులు చేశారు. పేకాట ఆడుతున్న పదిమందిని అరెస్టు చేసి వారి నుంచి రూ. 9200నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు పేర్కొన్నారు.

క్రైం కార్నర్‌

వేర్వేరు కారణాలతో నలుగురి ఆత్మహత్య

వర్ని: కుటుంబ కలహాలతో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన వర్ని మండలంలోని చింతల్‌పేట్‌ తండాలో చోటు చేసుకుంది. ఎస్సై కృష్ణకుమార్‌ ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన హేమ్లిబాయి(55) కుటుంబ కలహాలతో గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. హేమ్లిబాయి మృతికి భర్త రాంచందర్‌, రెండో భార్య జెర్రీలే కారణమని మృతురాలి బంధువులు రాంచందర్‌ ఇంటిపై దాడి చేసి ఇంట్లో ఉన్న వస్తువులను ధ్వంసం చేశారు. తాము రాకముందే మృతదేహాన్ని గ్రామ శివారు నుంచి ఇంటికి ఎలా తీసుకొచ్చారంటు ఆగ్రహం వ్యక్తం చేసి ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న రుద్రూర్‌ సీఐ జేఎస్‌ రెడ్డి, వర్ని ఎస్సై కృష్ణకుమార్‌ ఘటన స్థలానికి చేరుకొని ఆందోళనకారులను సముదాయించారు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అప్పుల బాధతో రైతు ..

బాన్సువాడ: చేతికొచ్చిన పంట పాడవడం, చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన నస్రుల్లాబాద్‌ మండలం అంకోల్‌ గ్రామంలో చోటు చేసుకుంది. బాన్సువాడ పట్టణ సీఐ కృష్ణ ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. అంకోల్‌ గ్రామానికి చెందిన రాంగొండ(39) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ ఖరీఫ్‌లో వరి పంట సాగు చేస్తున్నాడు. వరి పంటకు ఎండాకు తెగుళ్ల సోకడంతో రెండు సార్లు స్ప్రే మందు పిచికారీ చేసినా ఫలితం లేకుండా పోయింది. ఎండాకు తెగుళ్లతో పంట పూర్తిగా పాడైందని భార్యతో చెప్పి బాధపడేవాడు. పంట పూర్తిగా పాడవడం, అప్పులు అధికం కావడంతో మనస్థాపానికి గురైన రాంగొండ ఈ నెల 21న ఇంటి నుంచి వెళ్లాడు. అదే రోజు రాత్రి రాంపూర్‌ అటవీప్రాంతంలో ఓ చెట్టుకు ఎవరో ఉరేసుకుని చనిపోయాడని గ్రామస్తులు రాంగొండ భార్య లక్ష్మికి చెప్పడంతో కుటుంబ సభ్యులతో కలిసి లక్ష్మి అటవీప్రాంతానికి వెళ్లి చూడగా ఆత్మహత్య చేసుకుంది తన భర్తే అని బోరున విలపించింది. అప్పులు పెరగడంతోనే తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య లక్ష్మి చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.



రాంగొండ(ఫైల్‌)

అనారోగ్యంతో ఒకరు..

కామారెడ్డి క్రైం: అనారోగ్యంతో ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని గొల్లవాడకు చెందిన షేక్‌ సలావుద్దీన్‌(57) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గత నాలుగేళ్లుగా అర్షమొలలు సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. చాలా చోట్ల చూయించినా నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఆసియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని..



కైలాస్‌(ఫైల్‌)

భిక్కనూరు: భార్య కాపురానికి రావడం లేదని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన భిక్కనూరు మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై సాయికుమార్‌ ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కర్రోల కైలాస్‌(45) ట్రాక్టర్‌ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొంత కాలంగా కైలాస్‌ భార్య రజిత మధ్య గొడవ జరుగుతోంది. ఈ క్రమంలో ఈ నెల 19న వీరి మధ్య గొడవ జరగడంతో కైలాస్‌ రజితపై చేయిచేసుకున్నాడు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసి పిల్లలతో కలిసి తల్లిగారింటికి వెళ్లింది. కైలాస్‌ రజితకు పలుమార్లు ఫోన్‌ చేసి ఇంటికి రావాలని కోరినా ఆమె వినలేదు. దీంతో జీవితంపై విరక్తి చెందిన కైలాస్‌ ఇంట్లో ఉన్న తల్లిని కూరగాయలు తెమ్మని బయటకు పంపి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం గమనించిన కైలాస్‌ బాబాయ్‌ లక్ష్మణ్‌ వెంటనే అతన్ని కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తల్లి పోచవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పడకల్‌లో ఒకరి అదృశ్యం



బండారి సాయన్న

జక్రాన్‌పల్లి: మండలంలోని పడకల్‌ గ్రామానికి చెందిన బండారి సాయన్న అనే వ్యక్తి అదృశ్యమైనట్లు ఎస్సై తిరుపతి ఆదివారం తెలిపారు. సాయన్న కొన్ని రోజులుగా ఎడపల్లిలో ఉంటున్నాడు. ఈ నెల 19న వ్యక్తిగత పనులపై పడకల్‌కు వచ్చాడు. అప్పటి నుంచి ఇంటికి రాలేదు. భార్య బండారి సత్తెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చేపలు పట్టేందుకు వెళ్లి యువకుడి మృతి

నవీపేట: మండలంలోని కోస్లీ శివారులోని అలీసాగర్‌ లిఫ్ట్‌ కాలువలో చేపలు పట్టేందుకు వెళ్లిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందినట్లు ఎస్సై వినయ్‌ ఆదివారం తెలిపారు. రెంజల్‌ మండలం మౌలాలి తండాకు చెందిన జాదవ్‌ సంతోష్‌(38) ఆదివారం వేకువజామున అలీసాగర్‌ కాలువలో చేపలు పట్టేందుకు వెళ్లాడు. ఉదయం ఇంటికి రాకపోయేసరికి సంతోష్‌ తండ్రి వసంత్‌ కాలువ సరిహద్దులో వెతుకగా సంతోష్‌కు చెందిన సంచి కనిపించింది. అనుమానంతో లిఫ్ట్‌ కాలువలో నీటిని నిలిపివేయగా సంతోష్‌ మృతదేహం కనిపించిందని పేర్కొన్నారు. చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందాడన్నారు. తండ్రి వసంత్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.